క్లుప్తంగా

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

నెన్నెల: రైతులు పత్తి, వరి పంటలలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని భీమిని ఏడీఏ సురేఖ అన్నారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. పత్తి పంటలో పొగాకు లద్దె పురుగు, రసం పీల్చే పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు వివరించారు. అనంతరం డివిజన్‌స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. డివిజన్ మండల వ్యవసాయాధికారులు, ఏఈవోలు రాంచందర్, మౌనిక, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: ప్రస్తుతం వరిపంట పిలక దశ నుంచి చిరు పొట్టదశలో ఉందని, పంటలో ఆకుముడత పురుగు, కాండం తొలిచే పురుగు, బ్యాక్టీరియా ఆకు, ఎండు తెగులు, జింక్ లోపం ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ధర్మరావుపేట క్లస్టర్‌లో వరి పొలాలను పరిశీలించి వ్యాధులు గుర్తించి, నివారణ మార్గాలను రైతులకు వివరించారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

కాసిపేట: మండలంలోని మారుమూల రొట్టపల్లి గ్రామపంచాయతీ పాత, కొత్త తిరుమలాపూర్ గ్రామాలలోని ఆదివాసీ కుటుంబాలకు శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 25 కిలోల బియ్యం, 15 రకాల నిత్యావసర సరుకులు, కిట్లను పంపిణీ చేశారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 జీ 2024 –25 సంవత్సరానికి జిల్లా గవర్నర్‌గా ఎన్నికైన లయన్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సహకారంతో కార్యక్రమం చేపట్టారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి

కాసిపేట: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకొని వాటిని సాధించడానికి కృషి చేయాలని మానసిక వైద్య నిపుణులు సునీల్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెంటల్ హెల్త్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ శంకర్, లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక డంప్‌లు సీజ్

నెన్నెల: మండలంలోని మైలారం బురుగు వాగు సమీపంలోని ప్రాణహిత చేవెళ్ల మెగా కంపెనీ వద్ద అక్రమంగా నిల్వ చేసిన 60 ట్రాక్టర్ల ఇసుక డంప్‌లను శుక్రవారం రెవెన్యూ, పోలీసు అధికారులు సీజ్ చేసి మైనింగ్ అధికారులకు అప్పగించారు. ఈ మేరకు పంచనామా నిర్వహించారు. అనుమతులు లేకుండా వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలించినా, నిల్వ చేసినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సీజ్ చేసిన ఇసుకను ఆన్‌లైన్ ద్వారా బుకింగ్‌కు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇసుక నిల్వ చేసిన వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ప్రసాద్, ఆర్‌ఐ సులోచన తెలిపారు.

'ప్రభుత్వ కళాశాల మంజూరుకు ఎమ్మెల్యే హామీ'

తాండూర్: తాండూర్, నెన్నెల మండలాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలను మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ హామీ ఇచ్చినట్లు తాండూర్ మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. తాండూర్ మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు, మాజీ జెడ్పీటీసీ సాలిగామ బానయ్యలు శుక్రవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ విషయమై స్పందించిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ సీఎం రేవంత్ రెడ్డికి నెన్నెల, తాండూర్ మండలాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

గ్రామ మంచినీటి సహాయకులుగా పని చేయాలి

జన్నారం: గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న మల్టీపర్పస్ కార్మికులే గ్రామ మంచినీటి సహాయకులుగా పని చేయాలని మిషన్ భగీరథ డీఈ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ కార్మికులకు మిషన్ భగీరథ నీటి సరఫరాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో శశికళ, ఎంపీవో జలందర్, భగీరథ ఏఈ అబురమ్ పాల్గొన్నారు.

కోటపల్లి: ప్రతీ గ్రామపంచాయతీలో మంచినీటి గ్రామ సహాయకుడి నియామకం, విధులపై శుక్రవారం కోటపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఏఎస్ఈ రవీందర్ ఆధ్వర్యంలో మల్టీపర్పస్ వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతీ గ్రామపంచాయతీలో మంచినీటి సహాయకుడు నిర్వహించే విధులను వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ విద్యాసాగర్‌రావు, ఏఈ బద్రీనాథ్, ఎంపీవో సత్యనారాయణ, ట్రైనర్లు పాల్గొన్నారు.

దండేపల్లి: మిషన్ భగీరథ నీటిని ఇంటింటికి అందించాలని, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ మధుసూధన్ సూచించారు. దండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల మంచినీటి సహాయకులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో ప్రసాద్, మిషన్ భగీరథ ఏఈఈ నరేశ్ పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి

జిల్లాలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ పార్టీ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు కొండా లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి గ్రామంలో 1915 సెప్టెంబర్ 27న ఓ నిరుపేద కుటుంబంలో జన్మించిన కొండా లక్ష్మణ్ ప్రజల్లో గుర్తింపు పొంది వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా, మరొకసారి డెప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తించారన్నారు. తెలంగాణ తొలి, మలి ఉద్యమాల్లోనే కాకుండా స్వాతంత్ర్య ఉద్యమంలో సైతం అలుపెరగని పోరాటం చేసిన ఘనత ఆయనకు దక్కిందని గుర్తు చేసుకున్నారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో జీఎం సంజీవరెడ్డి, గుడిపేట పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ పి.వెంకటరాములు, మందమర్రి ఏరియాలోని జీఎం కార్యాలయం ఆవరణలో జీఎం దేవేందర్ కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటాలకు నివాళులర్పించారు. మంచిర్యాల జిల్లాకు ఆయన పేరు పెట్టాలని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ సాధన సమితి అధ్యక్షుడు బండి మల్లిఖార్జున్ డిమాండ్ చేశారు.


మంచిర్యాలరూరల్(హాజీపూర్): నివాళులర్పిస్తున్న కమాండెంట్ వెంకటరాములు, అధికారులు


శ్రీరాంపూర్: చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జీఎం సంజీవరెడ్డి


దండేపల్లి: లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నాయకుల నివాళి


మంచిర్యాలఅర్బన్: నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సరిత


కోటపల్లిలో నివాళులర్పిస్తున్న తహసీల్దార్ మహేంద్రనాథ్


మందమర్రిరూరల్: కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జీఎం


తాండూర్: లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు


పాతమంచిర్యాల: చారక ట్రస్టు భవన్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు


కాసిపేట: ఎంపీడీవో కార్యాలయంలో నివాళులర్పిస్తున్న సిబ్బంది


లక్సెట్టిపేటలో పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు


మంచిర్యాలటౌన్: పూలమాల వేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య


మంచిర్యాలరూరల్(హాజీపూర్): తహసీల్దార్ కార్యాలయంలో..


శ్రీరాంపూర్: పూలమాల వేసున్న మున్సిపల్ అధికారులు


వేమనపల్లి: నివాళులర్పిస్తున్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

కోర్టు ఆవరణలో స్వచ్ఛ భారత్

చెన్నూర్: చెన్నూర్ కోర్టు ఆవరణలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఆవరణలో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని జూనియర్ సివిల్ జడ్జి పర్వతపు రవి, న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో కలిసి తొలగించారు. జడ్జి మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. న్యాయవాదులు రాంబాబు, రమేశ్ చందర్ గిల్డా, మద్ది కార్తీక్, కాయిత మహేశ్, మల్లేశంగౌడ్ పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లో స్వచ్ఛత కార్యక్రమం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో స్వచ్ఛత 4.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ ఆదేశంతో శుక్రవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి ఇతర అధికారులు తట్ట, పారా చేతబట్టి పరిసరాల్లో చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. వర్క్‌షాప్ డీజీఎం రవీందర్, ఇంజనీర్లు రాకేశ్ రెడ్డి, రవికుమార్, శ్రీనివాస్, ఫిట్ సెక్రెటరీ సదానందం పాల్గొన్నారు.


చెన్నూర్ కోర్టు ఆవరణలో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న జడ్జి

తాండూర్: తాండూర్ గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి దివాకర్ ఆధ్వర్యంలో, రేచిని గ్రామ పంచాయతీలో ఎంపీవో అనిల్ కుమార్ నేతృత్వంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు చేపట్టారు. రేచిని గ్రామ పంచాయతీ కార్మికులకు తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ సిబ్బందికి పోస్ట్ ఆఫీస్ ఇన్సూరెన్స్‌లు చేయించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


చెన్నూర్: పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు


మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): విద్యార్థులతో ప్రిన్సిపాల్

చెన్నూర్: హైదరాబాద్‌లోని బీహెచ్ఈఎల్ కాంప్లెక్స్‌లో జరిగిన శ్రీ సరస్వతీ శిశుమందిరాల ఆధ్వర్యంలో రాష్ట్ర విజ్ఞాన మేళా క్విజ్ పోటీలలో చెన్నూర్ శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచారు. విద్యార్థుల బృందాన్ని ప్రధానాచార్యులు రమాదేవి అభినందించారు.

కుస్తీ, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): లక్సెట్టిపేట మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 23న నిర్వహించిన కుస్తీ, వాలీబాల్ పోటీల్లో రామకృష్ణాపూర్ జ్యోతిబాపూలే విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమరాణి తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. కుస్తీ పోటీల్లో 66 కేజీల విభాగంలో శ్రీజ, వాలీబాల్ పోటీల్లో సంజన, అన్విత ఎంపికైనట్లు వారు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ స్వరూపరాణి, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, పీడీ సోనియా, పీఈటీ మల్లిక తదితరులు ఉన్నారు.

'బెల్లంపల్లికి ఎమ్మెల్యే ఏం చేశారో చెప్పాలి'

బెల్లంపల్లి: పది నెలల కాలంలో బెల్లంపల్లికి ఎమ్మెల్యే వినోద్ ఏం చేశారో చెప్పాలని బెల్లంపల్లి మున్సిపల్ వైస్‌చైర్మన్ బత్తుల సుదర్శన్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బెల్లంపల్లి సమీకృత కూరగాయల మార్కెట్ నిర్మాణానికి, బెల్లంపల్లికి గోదారి జలాలు సరఫరా చేయడానికి నిధులు గత బీఆర్‌ఎస్ హయాంలోనే మంజూరయ్యాయన్నారు. ఆ నిధులను తాను మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే వినోద్ ఒక్క రూపాయి కూడా బెల్లంపల్లికి మంజూరు చేయించలేదని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్, అనుబంధ సంఘాల నాయకులు వాజిద్, అలీ, చంద్రశేఖర్, అరుణ్‌కుమార్, గోపి, మహేశ్, సురేశ్ పాల్గొన్నారు.

వైద్యులు ప్రజలకు సేవలందించాలి

లక్సెట్టిపేట: వైద్యులు ప్రజలకు సేవలందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిని పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, ప్రతీరోజు అప్రమత్తంగా ఉంటూ రోగులకు సేవలు అందించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అందుబాటులో ఉండాలని సమయపాలన పాటిస్తూ స్నేహభావంతో ఉండాలని సూచించారు. ప్రభుత్వం మెరుగైన సేవలందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. రోగుల కోసం మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం రిజిస్టర్లు, మందులను పరిశీలించి నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవన పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్, తహసీల్దార్ దిలీప్‌కుమార్, కమిషనర్ రాజశేఖర్ పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

'ఆదరించండి అండగా ఉంటా..'

మంచిర్యాలఅగ్రికల్చర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చట్టసభల్లో పోరాడుతానని, రానున్న కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా తనకు మద్దతు ఇవ్వాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి. నరేందర్‌రెడ్డి కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగ, నిరుద్యోగల పక్షాన పోరాడేందుకు, సామాజిక సేవ చేసేందుకు ఎన్నికల్లో పోటీ చేస్తానన్నారు.


మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

సంక్షిప్త వార్తలు

లంబాడా హక్కుల జాగృతి కార్యవర్గం నియామకం

జన్నారం: మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన లంబాడా హక్కుల జాగృతి సమావేశంలో నూతన కమిటీని నియమించారు. లంబాడా సేవా సంఘం నాయకులు బీమ్‌లాల్ నాయక్, ప్రకాశ్ నాయక్, సందేశ్ నాయక్‌ల ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా బాదవత్ సంతోష్‌నాయక్, గౌరవ అధ్యక్షుడిగా లాకవత్ నందు నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దినేశ్‌నాయక్, ఉపాధ్యక్షులుగా సంతోష్‌నాయక్, రాజునాయక్, ప్రధాన కార్యదర్శిగా బాదవత్ సత్యనారాయణ, సాంస్కృతిక కార్యదర్శిగా అమర్‌సింగ్, కార్యదర్శులుగా భగవాన్‌దాస్, భన్సీనాయక్, రామునాయక్, తిరుపతినాయక్, ధర్మునాయక్, భరత్‌నాయక్, జలందర్‌నాయక్, రాజునాయక్, రవి నాయక్, రోహిదాస్, రవి నాయక్, కోశాధికారి ప్రేంసింగ్ నాయక్‌లను ఎన్నుకున్నారు.

బతుకమ్మ చీరలు పంపిణీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని గిరిజన గ్రామాలు ర్యాలీ, నాగారం, గఢ్‌పూర్, చిన్నగోపాల్‌పూర్ గ్రామాల్లోని మహిళలకు శుక్రవారం కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ఆధ్వర్యంలో బతకమ్మ కానుకగా చీరలు పంపిణీ చేశారు.

చికిత్స కోసం ఎల్‌వోసీ మంజూరు

భీమారం: మండలంలోని కాజిపల్లి గ్రామానికి చెందిన శ్రీరాముల శ్రీనివాస్ అనే వ్యక్తి కిడ్నీ సంబంధిత వ్యాధితో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి బాధితుడి చికిత్స కోసం రూ.3.50 లక్షల ఎల్‌వోసీని అందజేసినట్లు మండల కాంగ్రెస్ నాయకులు శెడంశెట్టి రమేశ్ శుక్రవారం తెలిపారు.

కేజీబీవీ విద్యార్థినులకు రక్త పరీక్షలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థినులకు శుక్రవారం రక్త పరీక్షలు నిర్వహించారు. కస్తూర్బాలో చదువుకుంటున్న 9, 10, ఇంటర్మీడియెట్ విద్యార్థునులు 55 మంది నుంచి రక్త పూతలు సేకరించి పరీక్షించారు. ఆర్‌బీఎస్‌కే వైద్యుడు రామకృష్ణ, జిల్లా సంక్షేమ అధికారి స్వరూపారాణి మాట్లాడుతూ బాలికలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

'చలో హైదరాబాద్' విజయవంతం చేయండి

తాండూర్: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నల్ల చట్టాలు, నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 30న చేపట్టనున్న ధర్నాకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం మాదారం టౌన్‌షిప్‌లో కాంట్రాక్ట్ సివిల్ కార్మికులతో కలిసి ఆవిష్కరించారు.

ట్రాన్స్‌కో ఎస్ఈకి సన్మానం

మంచిర్యాలఅగ్రికల్చర్: ట్రాన్స్ కో ఉమ్మడి ఆదిలాబాద్ సర్కిల్ ఐఎన్‌టీయూసీ 327 అనుబంధ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన రమేశ్, పాత మంచిర్యాలలో ట్రాన్స్‌కో ఎస్ఈ వెంకటేశ్వర్ రావును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఈని సన్మానించారు.

డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ ఎంపిక పోటీలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎన్‌సీసీ ఎంపిక పోటీలు నిర్వహించారు. కళాశాలలో ఉన్న 43 వేకెన్సీలకు 60 మంది పోటీపడ్డారు. ఆదిలాబాద్ బెటాలియన్ నుంచి నాయక్ సుబేదార్ కుల్దీప్‌సింగ్, హవల్దార్ బ్రిజేష్‌కుమార్‌ల పర్యవేక్షణలో వివిధ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన 43 మందిని ఎంపిక చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, కళాశాల ఎన్‌సీసీ కేర్‌టేకర్ మహేశ్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికులకు ఇన్సూరెన్స్

జన్నారం: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు ప్రభుత్వ ఆదేశాల మేరకు లైఫ్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించినట్లు ఎంపీడీవో శశికళ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండలంలోని 29 గ్రామ పంచాయతీలకు చెందిన మల్టీపర్పస్ వర్కర్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమున్న వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇన్సూరెన్స్ సిబ్బంది ద్వారా ఒక్కో కార్మికుడికి రూ.10 లక్షల ఇన్సూరెన్స్ చేయించినట్లు ఎంపీడీవో తెలిపారు. ఎంపీవో జలందర్, ఈవో రాహుల్ ఉన్నారు.

పంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు

నెన్నెల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు రక్తపరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి తెలిపారు. అనంతరం బీమా సౌకర్యాన్ని కల్పించారు. కార్మికులు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఎంపీడీవో సూచించారు.

తాండూర్ ఎంఈవోగా మల్లేశం

తాండూర్: తాండూర్ మండల విద్యాధికారిగా మల్లేశం నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని తంగళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న మల్లేశంను ఎంఈవోగా నియమించారు.

'రూమ్ టూ రీడ్' సద్వినియోగం చేసుకోవాలి

దండేపల్లి: రూమ్ టూ రీడ్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో చిన్నయ్య అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రూమ్‌టూ రీడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్, లైబ్రరీ నిర్వహణకు సంబంధించిన పోస్టర్లను రెబ్బనపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆవిష్కరించారు.

ఎస్టీ వర్గీకరణ చేయాలని వినతి

దండేపల్లి: ఎస్టీ వర్గీకరణ చేయాలని కోరుతూ రాజ్‌గోండ్ సేవాసమితి ఆధ్వర్యంలో దండేపల్లిలో తహసీల్దార్ సంధ్యారాణికి శుక్రవారం వినతిపత్రం అందించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ ఫలాలు అందరికి దక్కడం లేదని, గిరిజనులు ఆర్థికంగా, విద్యా ఉద్యోగ ఉపాధి రంగాల్లో అన్ని విధాలుగా అసమానతలకు గురువుతున్నారన్నారు.

వార్డు సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 21వ వార్డులో ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆకాశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

జన్నారం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రాష్ట్రీయ బాల సంస్థ కార్యక్రమంలో భాగంగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. మంచిర్యాలకు చెందిన ఆర్‌బీఎస్‌కే సంస్థ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ గౌరీశంకర్, టెక్నీషియన్ శంకర్‌ల ఆధ్వర్యంలో కలమడుగు పాఠశాలలో 251 మంది విద్యార్థులకు ఉచితంగా పరీక్షలు చేశారు. హెచ్ఎం కట్ట రాజమౌళి పాల్గొన్నారు.

అధికారుల ఆకస్మిక బదిలీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల ఎంపీడీవో మధుసూదన్, ఎంపీవో శ్రీనివాసరెడ్డిలు ఆకస్మికంగా బదిలీ అయ్యారు. ఇద్దరు కీలక అధికారులు ఒక్కసారిగా బదిలీ కావడంతో శుక్రవారం మండలంలో తీవ్ర చర్చకు దారితీసింది. ఇటీవల అధికారికంగా జరిగిన కార్యక్రమంలో ఓ ప్రజాప్రతినిధి అత్యుత్సాహం చూపడంతోనే ఇద్దరు అధికారులపై బదిలీ వేటు పడిందని గుసగుసలు జోరుగా సాగాయి. ఎంపీడీవో మధుసూదన్ భీమారం ఎంపీడీవోగా బదిలీ చేయగా దండేపల్లి ఎంపీడీవో ప్రసాద్‌కు మండలానికి ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమించారు. ఎంపీవో శ్రీనివాసరెడ్డిని వేమనపల్లి మండలానికి బదిలీ చేయగా ఆయన స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

శ్రీరాంపూర్: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సీసీసీ నస్పూర్ ఎస్సై సుగుణాకర్ తెలిపారు. శుక్రవారం సీసీసీ పోలీసుల ఆధ్వర్యంలో ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు.

గుణాత్మక విద్య అందించాలి

కాసిపేట: విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని ఎంఈవో వెంకటేశ్వరస్వామి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాసిపేట జిల్లా పరిషత్ పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ ప్రాథమిక ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల సామర్థ్యాలు గుర్తించి బోధన చేయాలన్నారు.

స్వర్ణోత్సవ సభ విజయవంతం చేయండి

వేమనపల్లి: అక్టోబర్ 24న జరిగే పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ద స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్ కోరారు. మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్ వద్ద విద్యార్థులతో కలిసి శుక్రవారం పోస్టర్లు విడుదల చేశారు. పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

జిమ్‌ల తనిఖీ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మూడు జిమ్‌లపై పోలీసులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిమ్‌లలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు చేపట్టామని సీఐ బన్సిలాల్ తెలిపారు. ఫిట్‌నెస్‌ల పేరిట జిమ్‌లలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి, జిమ్ సీజ్ చేస్తామని హెచ్చరించారు.

గ్యాస్ రాయితీ ధ్రువపత్రాల పంపిణీ

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): మందమర్రి, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన మహిళలకు గ్యాస్ రాయితీ ధ్రువపత్రాలను చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పంపిణీ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే హాజరై మహిళలకు రాయితీ ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా 10వేల 729 మందికి గ్యాస్ రాయితీ పత్రాలు అందించినట్లు ఆయన పేర్కొన్నారు. క్యాతన్‌పల్లి మున్సిపల్ చైర్మన్ జంగం కళ, మందమర్రి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

దుస్తులు, పాదరక్షలు పంపిణీ

దండేపల్లి: రెబ్బనపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 15మంది విద్యార్థులకు బిగ్‌హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో దుస్తులు, పాదరక్షలు అందించినట్లు హెచ్ఎం రాజు తెలిపారు.

కౌన్సిల్ సమావేశంలో 11 అంశాలు ఆమోదం

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో జరిగింది. మున్సిపల్ చైర్మన్ జంగం కళ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 11 అంశాలపై కౌన్సిల్ సభ్యులు ఆమోద తీర్మాణం తెలుపగా రెండు అంశాలు వాయిదా పడ్డాయి. సమావేశంలో ఆఫీస్ మేనేజర్ స్వామి, డీఈఈ సుమతి, అసిస్టెంట్ ఇంజనీర్ అచ్యుత్, ఆర్ఐ సతీశ్, కౌన్సిల్ సభ్యులు తదితరులు ఉన్నారు.

భీమారం రిజర్వు ఫారెస్ట్‌లో 'వనదర్శిని'

భీమారం: అటవీశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం భీమారం రిజర్వు ఫారెస్ట్‌లో వన దర్శిని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈమేరకు డెప్యుటీ రేంజ్ ఆఫీసర్ సుధాకర్ మాట్లాడుతూ విద్యతో పాటు అడవిలో గల వివిధ రకాల చెట్ల గురించి అవగాహన ఉండాలనే ఉద్దేశంతో విద్యార్థులను అడవికి తీసుకొచ్చినట్లు తెలిపారు. అనంతరం సెంట్రల్ నర్సరీలోని పెంచుతున్న మొక్కలను విద్యార్థులు పరిశీలించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల: 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల: సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి: సంపత్ - 7036227114
చెన్నూర్: సంపత్‌కుమార్ - 9949708989
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899